



# మన ప్రజా శక్తి
తెలుగు దిన పత్రిక
ప్రజా గళమే ..మా కలం



విలేకర్లు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఆర్.సి. ఇంఛార్జ్‌లు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
అనుభవం, కొత్తవారు, ఆసక్తిగలవారు 90303 20743 లో సంప్రదించగలరు



సంపుటి : 01 | సంచిక: 05 | సోమవారం,అక్టోబర్06,2025 | ఎడిటర్ : మెరుగు భరత్ కుమార్ | పేజీలు : 4


## సిటీ బస్సు చార్జీల పెంపు
# దుర్మార్గం

### రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

- సిటీ బస్సు చార్జీల పెంపుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- ఒక్కసారే రూ.10 పెంచడం దుర్మార్గమైన నిర్ణయమన్న కేటీఆర్
- హైదరాబాద్ ప్రజలపై సీఎం కక్షగట్టారని విమర్శ
- నిత్య ప్రయాణికుడిపై నెలకు రూ.500 భారం



**హైదరాబాద్,అక్టోబర్5**

జంట నగరాల్లో సిటీ బస్సు చార్జీలను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక్కేసారి కనీస చార్జీని ఏకంగా 10 రూపాయలు పెంచడం దుర్మార్గమని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో బస్సు చార్జీలు పెంచడం వల్ల ప్రతి ప్రయాణికుడిపై నెలకు అదనంగా 500 రూపాయల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



## హమాస్‌కు నెతన్యాహు
# వార్నింగ్

- ట్రంప్ శాంతి ప్రణాళికకు హమాస్ పాక్షిక అంగీకారం
- హమాస్‌ను నిరాయుధీకరణ చేస్తామన్న నెతన్యాహు
- గాజా నుంచి పూర్తిగా వెనక్కి తగ్గేది లేదని స్పష్టీకరణ
- కొద్ది రోజుల్లో బందీలందరినీ విడిపిస్తామని ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు హమాస్ పాక్షికంగా అంగీకరించిన మరుసటి రోజే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను నిరాయుధీకరణ చేసే విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ఈ లక్ష్యాన్ని మంచి మాటలతో అయినా లేదా సైనిక చర్యతో అయినా సాధించి తీరతామని ఆదివారం స్పష్టం చేశారు. ఈ పరిణామం గాజా శాంతి చర్చల భవిష్యత్తుపై కొత్త సందేహాలను రేకెత్తిస్తోంది.

## జూబ్లీహిల్స్ బరిలో కాంగ్రెస్
# అభ్యర్థి ఎవరు?

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కాంగ్రెస్ దృష్టి
- అభ్యర్థి ఎంపికకు నలుగురితో జాబితా ఖరారు
- అధిష్ఠానం ఆమోదానికి పంపిన టీపీసీసీ
- రేసులో నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు, అంజన్‌కుమార్
- ఈ సాయంత్రం ఢిల్లీకి భట్టి, మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం
- బీసీ రిజర్వేషన్ల కేసుపై న్యాయవాదులతో చర్చలు



**హైదరాబాద్,అక్టోబర్5**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అభ్యర్థి ఎంపికపై రాష్ట్ర నాయకత్వం తన కసరత్తును పూర్తి చేసి, నలుగురు ఆశావహుల పేర్లతో కూడిన జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాను పార్టీ అధిష్ఠానానికి పంపనుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ పెద్దల నిర్ణయంపైనే నిలిచింది.పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిన తుది జాబితాలో నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్ ఉన్నారు ఈ నలుగురిలో ఒకరిని ఏఐసీసీ ఎంపిక చేసి అధికారికంగా ప్రకటించనుంది.

## సాగర్ 26 గేట్లు
# ఎత్తివేత

- 587.50 అడుగులకుచేరిన నీటిమట్టం
- జూరాల నుంచి శ్రీశైలానికి కొనసాగుతున్న వరద
- శ్రీశైలం 10 గేట్ల నుంచి నీటి విడుదల



**అక్టోబర్05,**

నాగార్జున సాగర్ డ్యామ్‌కు శ్రీశైలం నుంచి వరద కొనసాగుతున్నది. దీంతో అధికారులు 26 గేట్లు ఎత్తి ఐదు అడుగుల మేర నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో అక్కడి నుంచి శ్రీశైలానికి వరద ఉధృతి కొనసాగుతున్నది.

## తమిళనాడులో
# హై అలెర్ట్

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ
- 12 జిల్లాలకు భారీ వర్ష సూచన

తమిళనాడులో పలు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తనున్నాయి. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో నేడు కుండపోత వర్షాలు కురుస్తాయని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం (ఆర్ఎంసీ) హెచ్చరిక జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# డార్జిలింగ్‌లో కుండపోత

- పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్‌లో ఘోర ప్రమాదం
- కుప్పకూలిన మిరిక్, కుర్సియాంగ్‌లను కలిపే కీలక వంతెన



పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. కుండపోత వానల కారణంగా మిరిక్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రకృతి బీభత్సానికి పర్యాటక ప్రాంతాలైన మిరిక్, కుర్సియాంగ్‌లను కలిపే కీలకమైన దూదియా ఐరన్ బ్రిడ్జి పూర్తిగా కుప్పకూలింది. దీంతో ఆ ప్రాంతాల మధ్య రవాణా సంబంధాలు తెగిపోయాయి.

# బీహార్ ఎన్నికల వేళ బురఖాపై వివాదం

- బురఖాలో వచ్చే మహిళలను వెరిఫై చేయాల్సిందేనన్న బీజేపీ
- ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలంటూ ఎన్నికల సంఘానికి డిమాండ్
- బీజేపీ నేతలవి విద్వేష రాజకీయాలంటూ ఆర్జేడీ, కాంగ్రెస్ ఫైర్



**అక్టోబర్5,**

అసెంబ్లీ ఎన్నికల వేళ బీహార్ లో బురఖాపై వివాదం నెలకొంది. ఓటు వేసేందుకు బురఖాలో వచ్చే మహిళలను ఓటర్ కార్డులోని ఫొటోతో సరిపోల్చుకోవాలని బీజేపీ చేసిన డిమాండ్ పై ప్రతిపక్ష ఆర్జేడీ నేతలు మండిపడుతున్నారు. ఇప్పటికే స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే (ఎస్ఐఆర్) చేపట్టి ఓటర్ జాబితాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన నేపథ్యంలో బురఖాపై అభ్యంతరం చెప్పడం అర్థరహితమని వాదిస్తున్నారు.

## పత్తి రైతులకు తెలంగాణ
# సర్కార్ గుడ్ న్యూస్

- రాబోయే వారంలోపే సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తామన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సీసీఐ ప్రతినిధులు, మిల్లర్లతో ఈ నెల 6న మరోసారి సమావేశమవుతామని వెల్లడి
- రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించమన్న మంత్రి తుమ్మల



**హైదరాబాద్,అక్టోబర్5**

తెలంగాణ పత్తి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాబోయే వారంలోనే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా పత్తి కొనుగోళ్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.తన నివాసంలో పత్తి కొనుగోళ్ల అంశంపై నిన్న సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, ప్రస్తుతం కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంపై కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ నెల 6వ తేదీన సీసీఐ సీఎండీ, కాటన్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో మరోసారి సమావేశమవుతానని మంత్రి వెల్లడించారు. జిన్నింగ్ మిల్లులు సీసీఐ టెండర్లలో పాల్గొనకపోవడం వల్ల కొనుగోళ్ల ప్రక్రియలో ఏర్పడిన సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని తెలిపారు. సీసీఐ అధికారులు, మిల్లర్లతో సచివాలయంలో రెండు దఫాలు సమావేశం నిర్వహించినట్లు మంత్రి చెప్పారు.




## ఖలిస్థానీ ఉగ్రవాదంపై
# కెనడా ఉక్కుపాదం

- తమ దేశంలో ఖలిస్థానీ సంస్థలకు నిధులు అందుతున్నాయని అంగీకరించిన కెనడా
- సేవా సంస్థల నుంచి ఉగ్ర కార్యకలాపాలకు నిధుల మళ్లింపు
- ఖలిస్థానీ ఉగ్రవాదాన్ని హమాస్, హెజ్‌బొల్లాలతో పోల్చిన కెనడా నివేదిక

**అక్టోబర్05,**

ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థలకు తమ దేశం నుంచే నిధులు అందుతున్నాయన్న వాస్తవాన్ని కెనడా ప్రభుత్వం తొలిసారి అధికారికంగా అంగీకరించింది. ఈ మేరకు దేశంలోని మనీలాండరింగ్, ఉగ్రవాద ఫండింగ్‌పై విడుదల చేసిన ఒక కీలక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. సేవా సంస్థల ముసుగులో జరుగుతున్న ఈ నిధుల మళ్లింపుపై కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

# విదేశీ సంస్థల పెత్తనంలో మన బ్యాంకులు?



%భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. ఐతే ఆ వాటా 15 శాతానికి మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంక్ పరిమితి విధించింది. ఈ పరిమితిని ఆ యా సందర్భాన్ని బట్టి పెంచే అవకాశం ఉంది. ఏదేమైనా చట్టం ప్రకారం ఈ 15 శాతం పరిమితి అనేది ఇప్పటికీ కొనసాగుతోంది. ఐనప్పటికీ, 2018లో కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ అనే కంపెనీ, (ఇది మారిషస్ నుంచి కార్యకలాపాలు నడుపుతోంది) కేరళ లోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ వాటాలలో 51 శాతాన్ని కొనుగోలు చేయడానికి అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం గాని, రిజర్వు బ్యాంక్ గాని 15 శాతం పరిమితిని ఇలా 2018లో ఉల్లంఘించవలసిన అగత్యం ఏమిటో వివరించనేలేదు. అంతకు మునుపు, 1994లో (నయా ఉదారవాద విధానాల తొలి దినాల్లో) ఎస్-ఎస్ చౌవాలా గ్రూపు సంస్థ (ఇది థారులాండ్ నుండి నడుస్తోంది) ఇదే బ్యాంకులో 34 శాతం వాటాలను కొనుగోలు చేస్తానని ముందుకొచ్చినప్పుడు ఆ అభ్యర్ధనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అలా తిరస్కరించడం సరైనది. కాని ఆ తర్వాత 2018లో ఎందుకు అనుమతించారో ఇప్పటికీ వివరణ లేదు.ఇప్పుడు ఐడిబిఐ బ్యాంక్ (ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ఒక విదేశీ ప్రైవేటు సంస్థకు అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఐడిబిఐ బ్యాంక్ ప్రభుత్వ రంగ సంస్థగా ప్రత్యేకంగా పరిగణించబడకపోయినప్పటికీ, దానిలోని మెజారిటీ వాటాదారుడిగా ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న ఎల్ఐసి సంస్థ 2019 నుంచీ ఉంది.అందుచేత ఈ విషయమై ఎన్ని అభ్యంతరాలు వెలువడుతున్నప్పటికీ, విదేశీ సంస్థలు మన దేశీయ బ్యాంకుల మీద పెత్తనం పొందడానికి అనుమతించేందుకు ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా మొగ్గు చూపుతోంది. ఎందుకు ఈ విధంగా జరుగుతోందన్న విషయాన్ని ఇంతవరకూ వివరించే ప్రయత్నం ప్రభుత్వం గాని రిజర్వు బ్యాంక్ గాని చేయలేదు. సాధారణంగా ఇటువంటి ప్రధాన, విధానపరమైన మార్పులు చేపట్టినప్పుడు 'విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసం' అంటూ సాకులు చెప్తారు. కాని ఈ సారి అటువంటిది కూడా లేదు. ఐతే, అటువంటి సాకు ఈ విషయంలో నిలబడదు. విదేశీ సంస్థలు మన బ్యాంకుల వాటాలను కొనుగోలు చేస్తే వచ్చే మొత్తమే చాలా తక్కువ. కేథలిక్ సిరియన్ బ్యాంక్‌లో 51 శాతం వాటాలను కొనుగోలు చేసిన ఫెయిర్ ఫాక్స్ సంస్థ చెల్లించినది కేవలం రూ.1200 కోట్లు మాత్రమే. పైగా, జూన్ 2024లో తమ వాటాల్లో కేవలం 9.72 శాతం వాటాలను అమ్మి రూ.592 కోట్లు, అంటే తాము చెల్లించిన దాంట్లో దాదాపు సగం, తిరిగి పొందారు. మన బ్యాంకుల యాజమాన్యం విదేశీ కంపెనీల చేతుల్లో ఉంటే అప్పుడు మన దేశంలోకి పెట్టుబడులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది అన్న వాదన కూడా పూర్తిగా తప్పుడు వాదనే. గతంలో విదేశీ వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను రిజర్వు బ్యాంక్ ఖచ్చితంగా పాటించినప్పుడు కూడా విదేశీ పెట్టుబడులు బాగానే వచ్చాయి. ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రావడం తగ్గిపోయి, వెనక్కి వెళ్ళిపోవడం పెరుగుతోందంటే అందుకు వేరే కారణాలు ఉన్నాయి (ఉదాహరణకు ట్రంప్ సుంకాల పెంపు). కొన్ని బ్యాంకులను విదేశీ సంస్థలకు అమ్మేసినంత మాత్రాను విదేశీ పెట్టుబడులు వెనక్కి పోతున్న ధోరణిని ఆపడం కూడా సాధ్యం కాదు. విదేశీ సంస్థల పెత్తనం కిందికి మన దేశీయ బ్యాంకులను అనుమతించే ప్రక్రియ ఎందుకిలా గోప్యంగా ముందుకు సాగుతోంది? అందునా అటువంటి ప్రక్రియ వలన మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వినాశకర ఫలితాలను చవి చూడవలసి వస్తుందని గుర్తించిన తర్వాత కూడా ఎందుకిలా జరుగుతోంది? (మన బ్యాంకులలో విదేశీ సంస్థల వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను తొలుత రూపొందించి అమలు చేసినది ఇందుకే కదా?)!బ్యాంకుల యాజమాన్యం విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే జరిగే హాని గురించి ఉన్నదానికన్నా ఎక్కువ చేసి చెప్తున్నారన్న వాదన ఉంది. భారతీయ బ్యాంకులు విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేయడం గురించి రిజర్వు బ్యాంక్ కొన్ని నిబంధనలను రూపొందించింది. ఆ నిబంధనలు మన బ్యాంకులకు కొన్ని పరిమితులు విధించాయి. ఆ పరిమితులకు లోబడి వ్యవహరించినంత కాలం మన బ్యాంకుల యాజమాన్యం ఎవరి చేతుల్లో ఉందన్నది అంత ప్రధానం కాదు. ఈ వాదనను ఒకవేళ అంగీకరించినా, అసలు మన భారతీయ బ్యాంకులను విదేశీ సంస్థకు ఎందుకు అప్పజెప్పాలన్న ప్రశ్నకు అది సమాధానం చెప్పదు. విదేశీ సంస్థల చేతుల్లో ఉంటే మన బ్యాంకుల నిర్వహణ బాగా మెరుగు పడుతుందన్న వాదన సైతం చెల్లదు. నిజానికి మన బ్యాంకులు విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే అప్పుడు ఇక్కడ చిన్న స్థాయి రుణాలను పొందేవారికి ఆ బ్యాంక్ అందుబాటులో ఉండదు. నిజానికి బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు వారికే ప్రాధాన్యతనివ్వాలి. కాని విదేశీ సంస్థల చేతుల్లో ఉన్నప్పుడు ఆ విధంగా జరగదు. పైగా అత్యున్నత స్థాయి అధికారుల జీతాలు మాత్రం బ్రహ్మాండంగా పెరుగుతాయి. కేథలిక్ సిరియన్ బ్యాంక్ అనుభవం ఇదే.అంతే కాదు, ఒకసారి మన బ్యాంకుల మీద పెత్తనం విదేశీ కంపెనీల చేతుల్లోకి పోయిన తర్వాత వాళ్ళు విదేశీ ఆస్తుల కొనుగోలు విషయంలో ఉన్న ప్రస్తుత నిబంధనలను, పరిమితులను ఎత్తివేయాలని మన ప్రభుత్వం మీద వత్తిడి పెంచుతారు. ఆ పరిమితులను ఎత్తివేస్తే అప్పుడు ఈ బ్యాంకులు విదేశీ స్పెక్యులేటివ్ వ్యాపారాల్లో పెట్టుబడులను ఎక్కువగా పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. ఎక్కువ లాభాలు వచ్చేటప్పుడు స్పెక్యులేటివ్ పెట్టుబడులైతే మాత్రం ఏమిటి నష్టం? అని ప్రశ్నించవచ్చు. స్పెక్యులేషన్ అంటేనే ఒక తరహా జూదం. అందులో లాభాలు వస్తున్నప్పుడు బాగానే ఉంటుంది. ఐతే, ఆ లాభాల్లో ఒక్క పైసా కూడా డిపాజిట్‌దారుల ఖాతాల్లో పడదు. అంతా యజమానులకే పోతుంది. ఒకవేళ ఆ స్పెక్యులేషన్‌లో నష్టం వస్తే మాత్రం అప్పుడు బ్యాంకులు దివాలా తీసే ప్రమాదాన్ని కూడా ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు డిపాజిటర్లు తమ కష్టార్జితాన్నంతటినీ పోగొట్టుకునే దుస్థితి వస్తుంది. అందుచేత చాలా పెద్ద సంఖ్యలో ఉండే డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఈ స్పెక్యులేటివ్ పెట్టుబడులకు దిగడం అనేది చాలా హానికరం. అందువలన భారతీయ డిపాజిటర్లకు లాభాలు ఏవీ రావు సరికదా తమ సమస్తాన్నీ కోల్పోయే ప్రమాదం ఉంది.

# ప్రజా సమస్యలపై జర్నలిస్టులు చైతన్యం చేయాలి

**- వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపాలి..**

**- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్..**

**నర్సంపేట అక్టోబర్ 05:**

నర్సంపేట : ప్రజా సమస్యలపై జర్నలిస్టులు ప్రజలను చైతన్యం చేయాలని,వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపాలనితెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ అన్నారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని కేఎస్ఆర్ స్కూల్ లో టీడబ్ల్యూజేఎఫ్ నర్సంపేట నియోజకవర్గ స్థాయి సమావేశం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కిషన్, కొమ్ము రాజు ల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ మాట్లాడుతూజర్నలిస్టులపై దాడులు జరగకుండా రక్షణ కల్పించేందుకు గతంలో అటాక్స్ కమిటీ ఉండేదన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం అటాక్స్ కమిటీ లేదని ఆవేదనవ్యక్తం చేశారు. జర్నలిస్టులు నియమ నిబంధనల మేరకు పని చేయాలని, ఏదైనా విషయం సోషల్ మీడియాలో వేగంగా ప్రచారం అవకాశం ఉన్నందున నిర్ధారించుకున్నకే వార్తలు రాయాలన్నారు. సమాజంలోని సమస్యలను అధ్యయనం చేసి వార్తలు రాయాలని సూచించారు. జర్నలిస్టులు నైతిక నియమాలు, సూత్రాలనుపాటించాలని, సమాజంలో హుందా తనంగా ఉండాలని చెప్పారు. టీ డబ్ల్యూ జే ఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులను వృత్తి పరంగా తీర్చిదిద్దే కార్యక్రమాలను





నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ గా కుంటమల్ల అరవింద్



నెక్కొండ కో కన్వీనర్ గా భూక్యా వెంకన్న రాథోడ్

నిర్వహించాలని, సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నిరుపేద విద్యార్థులు చదువు కు దూరమవుతున్నారని, వారికి సహకరించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. 10ఏండ్లలో కెసిఆర్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క సొసైటీ కి కుడా స్థలం ఇవ్వలేదని ఆరోపించారు.జర్నలిస్టుల కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసిని తీసుకురావాలని, గతంలో మంత్రులు, ప్రజాప్రతినిధులతో జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు ఇచ్చారని చెప్పారు. జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి ప్రత్యేక పాలసి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అక్రిడేషన్ కార్డుల మంజూరులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని, మళ్లీ డిసెంబర్ వరకు గడువు పొడగించిందన్నారు. టీ డబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మచ్చిక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబసభ్యులకు విద్య, వైద్యం లో ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరారు. టీ డబ్ల్యూ జే ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పొడేటి అశోక్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, జర్నలిస్టులకు నివేషణ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీ డబ్ల్యూ జే ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఇటీవల వరంగల్ లో జరిగిన టీ డబ్ల్యూ జే ఎఫ్ మహాసభల్లో ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.అనంతరం నర్సంపేట నియోజకవర్గ అడ్ హక్ కమిటీ ని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా కుంటమల్ల అరవింద్,కో కన్వీనర్లుగా వల్లాజీ సురేష్, కల్లెపు ప్రణీత్, బాధావత్ రవి,నెక్కొండ మండలం కో కన్వీనర్ గా భూక్య వెంకన్న రాథోడ్,దోనాల రమేష్,ఇంగోలి అశోక్ రావు, నర్సంపేట టౌన్ కో కన్వీనర్ గా ఈదుల కృష్ణ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమం లో టీ డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా నాయకులు జినుకల రజినికుమార్,కొండపర్తి చంద్రమోహన్,కల్లెపు వెంకటేశ్వర్లు, వివిధ మండలాల రిపోర్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల వద్ద రూ. 1.82 లక్షల కోట్ల అన్ క్లెయిమ్డ్ ఆస్తులు..




**- 'మీ సొమ్ము - మీ హక్కు' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న నిర్మలా సీతారామన్**

**- ప్రజలు సరైన పత్రాలతో వచ్చి తమ సొమ్ము తీసుకోవాలని సూచన**

**- పౌరులకు అధికారులు అవగాహన కల్పించాలన్న నిర్మలా సీతారామన్**

బ్యాంకులు, నియంత్రణ సంస్థల వద్ద రూ. 1.82 లక్షల కోట్ల విలువైన ఆర్థిక వనరులు ఎటువంటి క్లెయిమ్ చేయబడకుండా నిలిచిపోయాయని, ఆయా సంస్థలు వాటిని అర్హులకు చేరేలా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం నాడు సూచించారు. గుజరాత్ గాంధీనగర్‌లో మూడు నెలల పాటు జరగనున్న 'మీ సొమ్ము - మీ హక్కు' అనే కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ, అవగాహన, ప్రచారం, కార్యాచరణ అనే మూడు అంశాలపై దృష్టి సారించాలని కోరారు.సదరు నిధులకు సంబంధించిన క్లెయిమ్‌లు పరిష్కరించబడని కారణంగా, అవి సరైన లబ్ధిదారులకు చేరకుండా ఉన్నాయని ఆమె తెలిపారు. బ్యాంకు డిపాజిట్లు, బీమా, ప్రావిడెండ్ ఫండ్, షేర్లు మొదలైన రూపాల్లో ఈ నిధులు బ్యాంకులు, ఇతర నియంత్రణ సంస్థల వద్ద ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలు అవసరమైన పత్రాలతో వచ్చి తమ సొమ్మును తిరిగి పొందాలని ఆమె సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం కేవలం సంరక్షకుడి పాత్ర పోషిస్తుందని ఆమె స్పష్టం చేశారు.ఎవరూ క్లెయిమ్ చేయని నగదు దీర్ఘకాలంలో ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు బదిలీ అవుతూ ఉంటుందని నిర్మలా సీతారామన్ వివరించారు. బ్యాంకుల నుంచి ఆర్బీఐకి, సెబీ నుంచి మరో సంస్థకు ఇలా నగదు మారుతుందని ఆమె తెలిపారు. క్లెయిమ్ చేసుకోని ఆర్థిక వనరుల కోసం ప్రభుత్వం 'ఉద్గమ్' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందని, దీని ద్వారా పౌరులు తమ సొమ్మును క్లెయిమ్ చేసుకోవచ్చని ఆమె తెలియజేశారు.పౌరులు తమ సొమ్మును క్లెయిమ్ చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులపై ఉందని నిర్మలా సీతారామన్ నొక్కి చెప్పారు. అవసరమైతే బ్యాంకులు గ్రామాల్లో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. క్లెయిమ్ చేయని మొత్తాన్ని అర్హులకు చేరేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేశారు.

# చ్చేవారం భారత పర్యటనకు రానున్న బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్


భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన అక్టోబర్ 8 నుంచి రెండు రోజుల పాటు ఇక్కడ అధికారిక పర్యటన చేపట్టనున్నారని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. యూకే ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కీర్ స్టార్మర్ భారత్‌కు రావడం ఇదే ప్రథమం.ఈ పర్యటనలో భాగంగా అక్టోబర్ 9న ముంబైలో ప్రధాని మోదీ, స్టార్మర్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఇరు దేశాల మధ్య కుదిరిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించనున్నారు. 'విజన్ 2035' రోడ్‌మ్యాప్‌లో భాగంగా వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు, విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో సహకారంపై చర్చిస్తారు. ముఖ్యంగా, ఇరు దేశాల ఆర్థిక భాగస్వామ్యానికి మూలస్తంభంగా భావిస్తున్న 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం' (సెటా) ద్వారా లభించే అవకాశాలపై వీరు ప్రముఖ వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతోనూ సంప్రదింపులు జరుపుతారు.పర్యటనలో భాగంగా ఇరువురు ప్రధానులు ముంబైలో జరిగే 6వ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొని కీలక ప్రసంగాలు చేస్తారు. ఈ కార్యక్రమం సందర్భంగా పారిశ్రామిక నిపుణులు, ఆవిష్కర్తలతోనూ భేటీ కానున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత ఉన్న అంశాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.గత జులై 23-24 తేదీల్లో ప్రధాని మోదీ యూకేలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటనలో కుదిరిన ఒప్పందాలకు, చర్చలకు కొనసాగింపుగా స్టార్మర్ పర్యటన జరగనుంది. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య చరిత్రాత్మక 'సెటా' ఒప్పందం కుదిరింది. అలాగే, రక్షణ ఉత్పత్తుల సహ-రూపకల్పన, సహ-అభివృద్ధి, సహ-ఉత్పత్తిని



ప్రోత్సహించేందుకు 'రక్షణ పారిశ్రామిక రోడ్‌మ్యాప్'కు కూడా ఇరు దేశాలు ఆమోదం తెలిపాయి. తాజా పర్యటనతో భారత్-యూకేల మధ్య భవిష్యత్ భాగస్వామ్యం మరింత దృఢంగా మారుతుందని విదేశాంగ శాఖ విశ్వాసం వ్యక్తం చేసింది.

మన ప్రజాశక్తి తెలుగు దిన పత్రిక

# ఏకపక్ష తొలగింపులు!



బీహార్‌లో వివాదాస్పదమైన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(సర్)ను పూర్తి చేసిన ఎన్నికల సంఘం 47 లక్షల మందిని తొలగించి తుది ఓటరు జాబితాను ప్రకటించడం దారుణం. ఆరు శాతం ఓటర్లను తొలగించడం అసాధారణమే! అది కూడా సర్‌కు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ పార్టీల నాయకత్వంలో ప్రజా నిరసనలు, సుప్రీంకోర్టులో కేసు నడిచి ఎన్నికల సంఘానికి ధర్మాసనం కొన్నిసార్లు మొట్టికాయలు వేసిన తరువాత కూడా ఈ స్థాయిలో తొలగింపులంటే ప్రజాగ్రహం, కోర్టు చీవాట్లు లేకపోతే ఇసి ఇంకెన్ని లక్షల మంది ఓటర్లను తొలగించేదో కదా! సర్ ప్రక్రియకు ముందు బీహార్‌లో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉంటే, అందులో 65.63 లక్షల మంది ఓటర్లను తొలగించి 7.24 కోట్లతో ముసాయిదా ప్రకటించింది. వీరిలో మరణించిన, నకిలీ పత్రాలు సమర్పించిన వారిని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల చిరునామాలను నవీకరించినట్టు ఇసి తెలిపింది. సర్ ప్రక్రియలో కొత్త ఓటర్ల పేర్లను కూడా జాబితాలో చేర్చినట్టు పేర్కొంది. కానీ ఈ వాదన సత్యదూరం. ఎందుకంటే ముసాయిదా కన్నా 17.87 లక్షల మంది ఓటర్లు పెరిగినా వీరిలో 16.56 లక్షలకు పైగా యువత కొత్తగా ఓటర్ రిజిస్ట్రేషన్ కోసం ఫారం-6ను సమర్పించినవారే. పెరిగినదాంట్లో 93 శాతం మంది యువ ఓటర్లు. కనుక తొలి ముసాయిదాలో తొలగించిన 65.63 లక్షల ఓటర్లలో నవీకరించినా లేక సుప్రీం చెప్పాక అంగీకరించిన ఆధారాలతో చేర్చినవి అనుకున్నా అవి కేవలం ఒక లక్షకు అటు ఇటు మాత్రమే వుంటాయి. ఇదీ ఇసి నిర్వాకం.సర్ పేరిట ప్రజల హక్కులను హరించొద్దని, ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నవీకరించాలని ఇసిని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించడం స్వాగతించదగినది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ప్రవేశపెట్టిన తీర్మానానికి పాలక ఎల్‌డిఎఫ్, ప్రతిపక్ష యుడిఎఫ్ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం హర్షణీయం. సర్ చేపడుతున్న సమయం, 2002 జాబితాను ఆధారంగా వినియోగించాలనే నిర్ణయం, ఓటర్ల కోసం నిర్దేశించిన అర్హత షరతులపై అసెంబ్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మైనారిటీ కమ్యూనిటీలు, మహిళలు, పేద కుటుంబాలు, ఎస్‌సి, ఎస్‌టి తెగలు, ఎన్‌ఆర్‌ఐ కేరళీయ ఓటర్ల హక్కును సర్ నిరాకరించవచ్చునని తీర్మానంలో పేర్కొంది. కేరళలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని, 2026లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ సమయంలో సర్ చేపట్టాలనే ఇసి ఎత్తుగడ దురుద్దేశంతో కూడుకున్నదన్న విమర్శ సహేతుకమే! ఇసి నిర్ణయం జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి)ను అమలు చేయడానికి పరోక్ష మార్గమంటూ తీర్మానం ఆందోళన వ్యక్తం చేయడం సబబైనది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో.. అవి పూర్తయ్యేంత వరకు సర్‌ను వాయిదా వేయాలన్న డిమాండ్ శత శాతం సమర్ధనీయం.సర్ రాజ్యాంగ చెల్లుబాటు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ.. ఎన్నికలు సమీపిస్తున్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో దాన్ని అమలు చేయడంపట్ల ఇసి చూపుతున్న ఆతృత అమాయకపు చర్యగా అనుకోరాదు. పౌరసత్వ సవరణ చట్టాన్ని పునరుద్ధరింపచేసేందుకు వినియోగించే సెక్షన్లను సర్‌లో వినియోగించడం, పౌరసత్వాన్ని మత ఆధారితంగా చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న పెద్ద సవాలుగా భావించవలసి వుంటుంది. 1987 తర్వాత జన్మించిన వ్యక్తులు వారి తల్లిదండ్రుల్లో ఎవరికైనా పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలను సమర్పించాలనే షరతు వయోజన ఓటు హక్కును విస్మరిస్తుంది. 2003 తర్వాత జన్మించిన వ్యక్తులు ఇద్దరు తల్లిదండ్రుల పౌరసత్వ ఆధారాలను సమర్పించాలి. సుప్రీంకోర్టు గట్టిగా ఆదేశించిన తరువాత మాత్రమే ఆధార్ కార్డును ప్రాతిపదికగా అంగీకరించిందంటే ఓటర్లను జాబితాలకు దూరం చేయడానికి ఇసి ఎంతలా యత్నిస్తుందో విదితమవుతోంది. రికార్డులను రూపొందించలేకపోయారనే సాకుతో ఓటర్ల జాబితా నుండి వ్యక్తులను మినహాయించడం రాజ్యాంగం హామీ ఇచ్చిన వయోజన ఓటు హక్కును తిరస్కరించడమే. అక్టోబర్ 7వ తేదీ నుండి జరగనున్న సుప్రీంకోర్టులో తుది వాదనల అనంతరం సర్ చట్టబద్ధత విషయం తేలనుంది. ప్రస్తుతం సాగుతున్న ఎన్నికల కమిషన్ బీహార్ సందర్శన తర్వాత ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించవచ్చని వార్తలొస్తున్నాయి. ఈ ఉత్కంఠకు ఎలా తెర పడుతుందో మరి!సర్ పేరిట ప్రజల హక్కులను హరించొద్దని, ఓటర్ల జాబితాను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నవీకరించాలని ఇసిని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించడం స్వాగతించదగినది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ప్రవేశపెట్టిన తీర్మానానికి పాలక ఎల్‌డిఎఫ్, ప్రతిపక్ష యుడిఎఫ్ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం హర్షణీయం. సర్ చేపడుతున్న సమయం, 2002 జాబితాను ఆధారంగా వినియోగించాలనే నిర్ణయం, ఓటర్ల కోసం నిర్దేశించిన అర్హత షరతులపై అసెంబ్లీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మైనారిటీ కమ్యూనిటీలు, మహిళలు, పేద కుటుంబాలు, ఎస్‌సి, ఎస్‌టి తెగలు, ఎన్‌ఆర్‌ఐ కేరళీయ ఓటర్ల హక్కును సర్ నిరాకరించవచ్చునని తీర్మానంలో పేర్కొంది. కేరళలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని, 2026లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఈ సమయంలో సర్ చేపట్టాలనే ఇసి ఎత్తుగడ దురుద్దేశంతో కూడుకున్నదన్న విమర్శ సహేతుకమే! ఇసి నిర్ణయం జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి)ను అమలు చేయడానికి పరోక్ష మార్గమంటూ తీర్మానం ఆందోళన వ్యక్తం చేయడం సబబైనది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్న నేపథ్యంలో.. అవి పూర్తయ్యేంత వరకు సర్‌ను వాయిదా వేయాలన్న డిమాండ్ శత శాతం సమర్ధనీయం.సర్ రాజ్యాంగ చెల్లుబాటు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నప్పటికీ.. ఎన్నికలు సమీపిస్తున్న కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో దాన్ని అమలు చేయడంపట్ల ఇసి చూపుతున్న ఆతృత అమాయకపు చర్యగా అనుకోరాదు. పౌరసత్వ సవరణ చట్టాన్ని పునరుద్ధరింపచేసేందుకు వినియోగించే సెక్షన్లను సర్‌లో వినియోగించడం, పౌరసత్వాన్ని మత ఆధారితంగా చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న పెద్ద సవాలుగా భావించవలసి వుంటుంది. 1987 తర్వాత జన్మించిన వ్యక్తులు వారి తల్లిదండ్రుల్లో ఎవరికైనా పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలను సమర్పించాలనే షరతు వయోజన ఓటు హక్కును విస్మరిస్తుంది. 2003 తర్వాత జన్మించిన వ్యక్తులు ఇద్దరు తల్లిదండ్రుల పౌరసత్వ ఆధారాలను సమర్పించాలి. సుప్రీంకోర్టు గట్టిగా ఆదేశించిన తరువాత మాత్రమే ఆధార్ కార్డును ప్రాతిపదికగా అంగీకరించిందంటే ఓటర్లను జాబితాలకు దూరం చేయడానికి ఇసి ఎంతలా యత్నిస్తుందో విదితమవుతోంది. రికార్డులను రూపొందించలేకపోయారనే సాకుతో ఓటర్ల జాబితా నుండి వ్యక్తులను మినహాయించడం రాజ్యాంగం హామీ ఇచ్చిన వయోజన ఓటు హక్కును తిరస్కరించడమే. పడుతుందో మరి!

# సామాజిక మార్పు సాధించే నూతన తరం కావాలి



ప్రతి సంవత్సరం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (అక్టోబర్ 5) సందర్భంగా యునెస్కో ఒక ప్రత్యేక థీమ్‌ని విడుదల చేస్తుంది. 'తదుపరి తరం అభ్యాసకులను ప్రేరేపించడం, భవిష్యత్తు నాయకులను, ఆలోచనాపరులను రూపొందించడం' 2025 అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ థీమ్. ఆ దేశ అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను విద్య సృష్టించాలి. దేశ ఆర్థిక, సామాజిక అవసరాలకనుగుణంగా విద్యా వ్యవస్థను రూపొందించాలి. కాని, స్వేచ్ఛా వాణిజ్యం, ప్రపంచీకరణ విధానాలను అమలు చేస్తున్న దేశాల విద్యార్థులలో ఎక్కువ మంది జి7 దేశాల్లో పనిచేసే వారిగా, ఆ దేశ అవసరాలకు తగ్గ వనరులుగా మారే వారిగా తయారవుతున్నారు.భారతదేశ జాతీయ విద్యా విధానం 2020, ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న 'సాల్ట్' పథక ఒప్పందం ప్రకారం ఆంధ్ర రాష్ట్ర విద్యార్థులను అంతర్జాతీయ విద్యార్థులుగా తయారు చేయడమంటే వారు మన రాష్ట్ర అవసరాలకు తగ్గ వనరులుగా మారరనేది అర్ధమవుతుంది. కనుక 'సాల్ట్' పథకం రద్దు కావాలి.మంచి నాయకులు, మంచి ఆలోచనా పరులను రూపొందించడానికి పాఠశాలలు వేదికలు కావాలి. వితంతు పునర్వివాహాల కోసం కందుకూరి వీరేశలింగం కృషి, శ్రీనారాయణ గురుకుల వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేయటం, జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే మహిళా ఉద్ధరణ కోసం కృషి చేయడం, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వితంతు వివాహాల కోసం పని చేయడాన్ని, గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం', దేశమును ప్రేమించమన్న దేశభక్తి గీతాలను ఉపాధ్యాయులు అధ్యయనం చేయాలి.ఆనాటి సమాజంలో గూడుకట్టుకున్న దురాచారాలను కూకటి వేళ్ళతో పెకిలించడానికి ఎన్ని అవరోధాలను ఎదుర్కొన్నారో తెలుసుకోవాలి. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు సంఘ సంస్కరణ ఉద్యమం కోసం ఎలా కృషి చేశారో తెలుసుకోవాలి. వీరిలో ఎక్కువమంది ఉపాధ్యాయులుగా ఉంటూ సామాజిక మార్పు కోసం పని చేశారు. ఉపాధ్యాయులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలి.కేవలం విద్య అందించడమే కాకుండా సమాజ మార్పుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. బడిలో ఉపాధ్యాయుడు చేయాల్సింది పిల్లల నుంచి రాబట్టడం కాదు, పిల్లలకు తనను తాను సమర్పించుకోవడం అంటారు నీల్ అనే ఉపాధ్యాయుడు. నాటి యు.ఎస్.ఎస్.ఆర్‌లో ఒక స్కూల్ టీచర్ "ఒక వ్యక్తి ఒక వస్తువును 50 రూబుళ్లకు కొని 10 శాతం లాభానికి అమ్మాడు. అతనికి ఎంత లాభం వస్తుంది?" అని అడిగితే ఒక పిల్లవాడు "మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష" అని టక్కున సమాధానం చెప్పాడు. అంటే లాభం నష్టం అనేది ఈ దేశంలో లేదు అని చెప్పటం. ఇది విద్య ద్వారా సాధించాల్సిన ఒక సామాజిక కర్తవ్యం.విద్యా క్షేత్రంలో భవిష్యత్తు తరాన్ని తయారు చేసే పనిలో నియమించబడటం అనేది ఆర్థిక, జీతాల లెక్కలకు సంబంధించిన వ్యవహారం కాదు. రోజువారీ పాఠ్యాంశాలలో ఉన్న అంశాలను వల్లెవేయటం ఎంత మాత్రం కాదు. ఆసక్తి ఉండి లేదా ఏదో ఉద్యోగం కోసం ఈ వృత్తిలోకి వచ్చినా ఇది ఒక బృహత్తరమైన పని. ఎందుకంటే ఉపాధ్యాయులకు మాత్రమే రేపటి సమాజం ఎలా ఉండాలో తయారు చేయగలిగిన శక్తి ఉంటుంది. విద్యార్థికి నాలుగు అక్షరాలు నేర్పటం కోసం పైనుంచి కింది వరకు అధికారులు, విధానాలు, సంస్కరణలు ఎన్ని ఉన్నా, ప్రధాన కేంద్రం విద్యార్థి మాత్రమే. ఉపాధ్యాయులు ఈ విద్యార్థి చుట్టూనే ఏమైనా మాట్లాడాలి, పని చేయాలి. గతంలో 'మట్టి ముద్దగా బడికి పిల్లలు వస్తారు. వారిని మనం ఎలా కావాలంటే అలా తీర్చిదిద్దుకోవచ్చు' అనేవారు. కానీ నేడు చుట్టూ ప్రపంచీకరణ భ్రమలు, అవాస్తవ అంశాలు, విచ్చలవిడి స్వేచ్ఛా జీవితం కళ్ళ ముందుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఏదో ఒక పని చేస్తేగాని రోజు గడవడం కష్టమైపోయిన నేటి కాలంలో తల్లిదండ్రులు పిల్లల మీద శ్రద్ధ పెట్టడం సాధ్యం కాని పరిస్థితులు ఉన్నాయి. బడికి వచ్చే పిల్లలపైనా ప్రపంచీకరణ భావజాలం టన్నుల కొద్దీ ఉంటుంది. వీరిని సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తయారు చేయటం ఉపాధ్యాయుల బాధ్యతగా ఉండాలి."నీవు మాత్రమే ప్రపంచంలో ఉన్నావు. పెద్ద, చిన్న ఎవరినీ పట్టించుకోవాల్సిన పనిలేదు. రెక్కలు విచ్చుకుని ఎగిరిపో. ఎలా సంపాదించావు అన్నది కాదు? ఎంత సంపా దించావు, ఎంత విలాసంగా బతుకుతున్నావు అన్నదే ముఖ్యం! పోరాటం, నిజాయితీ, మాట తప్పనితనం, సమానత్వం, మానవత్వం, త్యాగం ఇవన్నీ నాన్సెన్స్, న్యూసెన్స్ మాటలు" అని ప్రపంచీకరణ చెబుతుంది. "ఇజాలు వేస్ట్, విహార యాత్రలు బెస్ట్" అని చెబుతుంది. వస్తువులను వినియోగించే పరికరంగా మనిషిని మార్చుతుంది. ఈరోజు గురించి మాత్రమే ఆలోచించు, రేపటి గురించి పట్టించుకోవద్దు అంటూ నీలోంచి నిన్ను కూడా వంటరి చేస్తుంది. నిన్ను వంటరి చేయటానికి తన భావజాలం సరిపోకపోతే కులం, మతం, జాతి భావనను ప్రేరేపిస్తుంది. నాకే అన్నీ తెలుసనే ధోరణి పెంచుతుంది. సాధించలేకపోతే ప్రాణాలు తీసుకోమంటుంది. ఇంతటి కల్మషమైన భావజాల ప్రభావం విద్యార్థుల పైనా వుంటుంది.విద్యార్థులకు అక్షర జ్ఞానం నేర్పాల్సిన ఉపాధ్యాయులను పాలకవర్గాలు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. వర్క్ పుస్తకాలు, టూల్ 1,2, యాప్‌లు, గిన్నిస్ బుక్ రికార్డ్స్, వీడియో కార్యక్రమాలు, నేర్చుకున్నది ఎంత అని అడిగే కంటే వీడియోలు అప్‌లోడ్ చేశారా లేదా అనే డేటా చుట్టూ ఉపాధ్యాయులు సాలెగూడులో చిక్కుకుపోయేట్లు చేస్తున్నాయి. దేశభక్తి, నైతిక విలువలు, రాజ్యాంగం, సమానత్వం వంటి అంశాలు చెప్పాలని ఉన్నా అవకాశం లేకుండా కార్యక్రమాల మీద కార్యక్రమాలు, ఈవెంట్లకు వేదికగా పాఠశాల మారిపోయింది. కొద్దిమంది ఉపాధ్యాయులు ఎన్ని ఆటంకాలు ఎదురైనా వీటిని అధిగమిస్తూనే విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించడానికి ప్రయత్నిస్తున్నారు.వారిని అభినందించాలి. మరికొద్ది మంది ఉపాధ్యాయులు ఇంటికి పరిమితం కావలసిన వారి వ్యక్తిగత నమ్మకాలను విద్యా క్షేత్రంలో ప్రదర్శిస్తున్నారు. అందరూ ఉండే బడిలో నమ్మకాలను, సాంప్రదాయాలను పాటించటం క్షమించరాని నేరం. ఈ బడి అందరిదీ, దీనిలో ఎలాంటి వ్యత్యాసాలు, అంతరాలు సృష్టించే పని మనం చేయకూడదు.

# జీవో నంబర్ 9ను రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 26న జీవో నంబర్ 9 జారీ చేసింది. ఈ జీవో ను సవాలు చేస్తూ వంగ గోపాల్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ చర్య సుప్రీంకోర్టు సూచించిన రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఉల్లంఘించిందని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ కేసును అక్టోబర్ 6న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన డివిజన్ బెంచ్ విచారించనుంది.షెడ్యూల్డ్ కులాలకు 15 శాతం రిజర్వేషన్లు, షెడ్యూల్డ్ తెగలకు 10 శాతం రిజర్వేషన్లతో కలిపి, మొత్తం కోటా 67 శాతంగా ఉందని, ఇది రాజ్యాంగ పరిమితిని మించిపోయిందని పిటిషనర్ వెల్లడించారు. ఈ నిర్ణయం తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 285%ా%ని ఉల్లంఘిస్తుందని వాదించారు. ఇది కె.కృష్ణ మూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా 50 శాతం పరిమితిని క్రోడీకరించింది'వికాస్ కిషన్‌రావ్ గవాలి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర', 'జైశ్రీ లక్ష్మణ్‌రావ్ పాటిల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసుల్లోని తీర్పులను ఉటంకిస్తూ, అసాధారణ పరిస్థితులలో తప్ప 50 శాతం సీలింగ్ ఉల్లంఘించరానిదని పిటిషనర్ ఎత్తి చూపారు. బీసీ రిజర్వేషన్ల పెంపు వన్-మ్యాన్ కమిషన్ నివేదిక ఆధారంగా జరిగిందని, అది బహిరంగపరచబడలేదు, శాసనసభలో చర్చించబడలేదు, సుప్రీంకోర్టు నిర్దేశించిన "ట్రిపుల్ టెస్ట్"ను సంతృప్తిపరచలేదని వంగ గోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 243%ఱ, 243ు% లకు, అలాగే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టానికి అతి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. చట్ట నియమాలను ఉల్లంఘించే విధంగా జీవోను రద్దు చేయాలని కోర్టును వంగ గోపాల్ రెడ్డి కోరారు.

# మహిళా అధికారులను ప్రశంసించిన వీసీ సజ్జనార్



హైదరాబాద్: టీజీఐసీసీసీ)లో సైబర్ క్రైమ్ అధికారులు, జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సభ్యులతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర పోలీసు కమిషనర్ వీ.సీ. సజ్జనార్ వృత్తిపరమైన, వ్యవస్థాపక పాత్రలలో మహిళల అంకితభావాన్ని ప్రశంసించారు. మహిళలు మొత్తం ప్రపంచానికి ప్రేరణ, బలానికి మూలమని సజ్జనార్ అన్నారు. తన బృందంలో దాదాపు 50% మంది మహిళా ఐపీఎస్ అధికారులు ప్రతిరోజూ ద్వంద్వ పాత్రల్లో రాణిస్తున్నారని, క్రమశిక్షణతో వారి విధులను నిర్వర్తిస్తూనే వారి ఇళ్లను నిర్వహిస్తారు.జేఐటీఓలో మహిళా వ్యవస్థాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నిలకడ, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన చిహ్నాలైన స్ఫూర్తిదాయకమైన మహిళలతో సంభాషించడం ఆయనకు గర్వంగా ఉందని సజ్జనార్ తెలిపారు. డిజిటల్ భద్రతకు సంబంధించి కమిషనర్ ప్రజలకు ఒక హెచ్చరిక సందేశాన్ని జారీ చేశారు. ప్రైవేట్ ఫోటోలు లేదా సున్నితమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంచుకోకుండా ఉండాలని నగర ప్రజలను కోరారు. అటువంటి డేటాను సులభంగా దుర్వినియోగం చేయవచ్చని హెచ్చరించారు.చాలా మంది మహిళలు ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడుతున్నారని, తరువాత తాము మోసపోయామని గ్రహించి కూడా, కొందరు కమ్యూనికేట్ చేస్తూనే ఉన్నారు. దీనివల్ల వారి ప్రమాదం పెరుగుతుందని సజ్జనార్ అన్నారు. అప్రమత్తంగా ఉండండి, ఒకరిని నమ్మే ముందు ధృవీకరించండి, డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చడానికి కలిసి పని చేద్దాం అని ఆయన చెప్పారు. కమిషనర్ తన సోషల్ మీడియా స్థితిపై ఈ సలహాను కూడా పంచుకున్నారు.



# 'కాంతార' కథ వెనుక 20 ఏళ్ల నాటి గొడవ

తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార చాప్టర్ 1' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి, ఆ సినిమా కథ పుట్టుక వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 20 ఏళ్ల క్రితం తన గ్రామంలో జరిగిన ఒక వాస్తవ సంఘటనే ఈ చిత్రానికి స్ఫూర్తి అని ఆయన తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కాంతార' సృష్టి వెనుక ఉన్న రహస్యాలను పంచుకున్నారు.సుమారు 20 ఏళ్ల క్రితం మా ఊరిలో వ్యవసాయ భూమికి సంబంధించి ఒక రైతుకు, అటవీ అధికారికి మధ్య పెద్ద ఘర్షణ జరిగింది. నేను దానిని కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవగా చూడలేదు. ప్రకృతికి, మానవ అవసరాలకు మధ్య జరుగుతున్న సంఘర్షణగా భావించాను. ఆ ఆలోచన నుంచే 'కాంతార' కథకు బీజం పడింది. మన సంస్కృతి, వ్యవసాయం చుట్టూ ఎలా అల్లుకుపోయిందో ఆలోచించడం మొదలుపెట్టాను" అని రిషబ్ వివరించారు.సినిమాలో అత్యంత కీలకమైన






క్లైమాక్స్ సన్నివేశాల గురించి మాట్లాడుతూ, "అందరూ క్లైమాక్స్ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారు. నిజానికి, ఆ సన్నివేశాల విజువల్స్ నేను కేవలం ఊహించుకున్నాను. నా వెనుక ఏదో ఒక అతీత శక్తి ఉండి ఆ సన్నివేశాలను రాయించిందని నేను బలంగా నమ్ముతాను" అని ఆయన అన్నారు.కథలో ఆలోచింపజేసే అంశం ఉంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని రిషబ్ శెట్టి అభిప్రాయపడ్డారు. "మన కంటెంట్ సామాన్యులకు కూడా సులభంగా అర్థమయ్యేలా ఉండాలి.

# సన్నీలియోన్ థ్రిల్లర్

కిల్లింగ్ లుక్స్‌తో యువతను ఉర్రూతలూగించే అందాల తార సన్నీలియోన్. ఇప్పుడు లీడ్ రోల్‌లో థ్రిల్ పంచేందుకు ముస్తాబవుతోంది. ఆమె ప్రధాన పాత్రలో రూపొందుతున్న తాజాచిత్రం 'త్రిముఖ'. రజేశ్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీదేవి మద్దాలి, రమేశ్ మద్దాలి నిర్మిస్తున్నారు.ఇందులో సన్నీలియోన్ మెయిన్ లీడ్‌లో నటిస్తుండగా యోగేశ్ కల్లే, అకృతి అగర్వాల్, సీఐడీ ఆదిత్య శ్రీవాస్తవ, ప్రవీణ్, షకలక శంకర్, ఆషురెడ్డి, సుమన్, రవిప్రకాశ్, సాహితి, సూర్య, జీవా, జెమిని సురేశ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల విడుదల చేసిన పోస్టర్‌ను చూస్తుంటే థ్రిల్లర్ సినిమాలా రూపొందుతున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుతం తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ సినిమా తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది. టీమ్ ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

# మహాదేవ నాయుడుగా శివాజీ



యూట్యూబ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక మార్క్‌ను క్రియేట్ చేసుకున్న షణ్ముఖ్ జస్వంత్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'ప్రేమకు నమస్కారం'. ఈ చిత్రానికి వీ భీమశంకర్ దర్శకుడు. ఏబీ సినిమాస్ పతాకంపై అనిల్ కుమార్ రావాడ, భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. ఇందులో ఉల్క గుప్తా హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో భూమిక ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. శివాజీ 'మహాదేవ నాయుడు'గా శక్తిమంతమైన పాత్రలో కనిపించబోతున్నారు. మహాదేవనాయుడు పాత్రను పరిచయం చేస్తూ మూవీటీమ్ విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ఆకట్టుకుంటోంది.మహాదేవ నాయుడు పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో ఈ వీడియో చూస్తే అర్థమవుతోంది. బ్రహ్మాజీ, శ్రీకాంత్ అయ్యంగార్, అరుణ్ అదిత్, రంగస్థలం మహేశ్, మణిచందన, కమల్, క్రాంతి, నీల రమణ, శోభన్, సుభాష్, కొటేశ్వరరావు వివిధ పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గ్యానీబీ గీత సాహిత్య: రామజోగయ్య శాస్త్రి, దినేశ్ కాకెర్లబీ డీవోపీ: కిషోర్ బోయిడపుబీ ఎడిటర్: కేసీబీ హరిబీ ఆర్ట్: రవికుమార్.

# అరి వచ్చేది అప్పుడే

వినోద్‌వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికు మార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ వంగ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఆర్‌వీ సినిమాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, డీ శేషురెడ్డి మారంరెడ్డి, నాయుడు నిర్మిస్తున్నారు. విజయదశమి సందర్భంగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు.అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఈ నెల 10న విడుదల చేయను న్నట్టు వెల్లడించారు. అరిషడ్వర్గాల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో సుమన్, ఆమని, శుభలేక సుధాకర్, వైవా హర్ష, శ్రీనివాసరెడ్డి, చమ్మక్ చంద్ర, జెమినీ సురేశ్, ఐడ్రీమ్ అంజలి, మనిక చిక్కాల తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: అనుప్ రూబె న్స్‌బీ సాహిత్యం: కాసర్ల శ్యామ్, వనమాలి, కళ్యాణ్ చక్రవర్తిబీ సినిమాటోగ్రఫీ: కృష్ణప్రసాద్, శివశంకర వరప్రసాద్‌బీ ఎడిటర్: జీ అవినాష్‌బీ ప్రొడక్షన్ డిజైన్: రాజీవ్ నాయర్.



# ఉస్తాద్ భగత్‌సింగ్ తీపి కబురు



పవన్‌కళ్యాణ్ కథానాయకుడిగా నటించిన 'ఓజీ' చిత్రం ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ సినిమా తర్వాత పవన్ హీరోగా మరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్'. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్ కాంబో లో తెరకెక్కుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కావటంతో దీనిపై భారీ అంచనాలున్నాయి.మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, కంటెంట్‌తో సినీప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అయితే, పవన్ అభిమానులకు దీపావళికి ఈ సినిమాపై మరింత క్లారిటీ రానుందా? అంటే ఇండస్ట్రీ వర్గాలు ఔననే సమాధానమే ఇస్తున్నాయి.ఎందుకంటే దీపావళి కానుకగా మేకర్స్ ఈ మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సినిమా వచ్చే ఏడాది ప్రథమార్థంలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని అర్థమవు తున్నా.. సరైన డేట్‌ను ఇంకా మేకర్స్ లాక్ చేయలేదు. దీపావళి సందర్భంగా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాల భోగట్టా! ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీత సారథ్యం వహిస్తుండగా, అయనంక బోస్ డీవోపీగా పనిచేస్తున్నారు.

# బాలీవుడ్‌పై రాశి ఖన్నా సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి రాశి ఖన్నా దక్షిణాది, ఉత్తరాది సినీ పరిశ్రమల పనితీరుపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తన కొత్త చిత్రం 'తెలుసు కదా' ప్రమోషన్లలో భాగంగా మాట్లాడిన ఆమె, తెలుగు చిత్ర పరిశ్రమ పని వాతావరణాన్ని ప్రశంసిస్తూ, బాలీవుడ్‌పై కొన్ని ఆసక్తికరమైన అభిప్రాయాలను పంచుకున్నారు.పని గంటల విషయంలో తెలుగు పరిశ్రమ ఎంతో మెరుగ్గా ఉంటుందని రాశి ఖన్నా తెలిపారు. "తెలుగులో రోజుకు సగటున 9 గంటలు మాత్రమే షూటింగ్ ఉంటుంది. కానీ, తమిళ, హిందీ పరిశ్రమల్లో 12 గంటల సుదీర్ఘ షిఫ్టుల వల్ల నటీనటులు ఎక్కువగా అలసిపోతారు" అని ఆమె వివరించారు. ఈ తేడా పనితీరుపై గణనీయమైన ప్రభావం చూపుతుందని ఆమె పేర్కొన్నారు.



# గర్ల్‌ఫ్రెండ్ వస్తోంది



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. ఈ సినిమాను ఓ అందమైన ప్రేమకథతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. తాజాగా ఓ స్పెషల్ వీడియోతో ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు.నవంబర్ 7న ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ వీడియో ఆకట్టుకుంటోంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్‌బీ సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్‌బీ ప్రొడక్షన్ డిజైన్: ఎస్ రామకృష్ణ, మౌనిక నిగోత్రి.